# 3. నారు పోసినవాడు

కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం క్రింద ఉండే ఓ పెద్ద కంపెనీలో పనిచేస్తూ, నెలకు వేయిరూపాయలపైగా జీతం సంపాదించుకొంటూ, స్వగ్రామంలో కాస్తోకూస్తో ఆస్తివుండీ పైకి ఎంతో గంభీరంగా- హుందాగా కనిపించే శ్యాంరావు కళ్ళవెంబడి ధారాపాతంగా నీళ్లుకారుతున్నాయంటే ఎవరూ నమ్మరేమో! కాని అతడు నిజంగానే ఏడుస్తున్నాడు. తన తెలివితక్కువతనానికి కుమిలి కుమిలి విలపిస్తున్నాడు. తన స్నేహితుని సలహాను పెడచెవిని పెట్టినందుకు తననుతానే నిందించుకుంటూ దుఃఖిస్తున్నాడు. తనకు ఆస్తి ఉన్నదని, మంచి ఉద్యోగమున్నదని విర్రవీగి భవిష్యత్తునుగూర్చి ఆలోచించక పోయినందుకు ఎంతగానో విలపిస్తున్నాడు. తన పూర్వ ఔన్నత్యాన్ని, ఇప్పటి దయనీయ పరిస్థితిని పోల్చుకుంటూ తనలోతానే హృదయవిదారకంగా రోదిస్తున్నాడు. అల్లారుముద్దుగా పెంచబడిన కూతురు బతుకు బండలపాలౌతుంటే ఏమీచేయలేని నిస్సహాయ స్థితిలో దైన్యంగా దుఃఖిస్తున్నాడు. రోగిష్ఠియైన భార్య ఎముకల గూడులా తయారై దైన్యం గొలిపేట్లుగా ఉంటే, పెళ్ళప్పటి ఆమె రూపాన్ని తలచుకొని గుండెలవిసేలా ఏడుస్తున్నాడు. యవ్వనంలో అడుగిడి, అడుగిడబోతున్న కూతుళ్ళు, చిరిగిన ఓణీలచాటున తమ పరువాలను దాచుకొనడానికి పడుతున్న పాట్లను చూడలేక పొగిలిపొగిలి ఏడుస్తున్నాడు. తన ఈడుపిల్లలతో

—కొలువ మల్లయ్య

ఆడుకోవడానికి వాళ్ళతో కలుపుగోలుగా ఉండడానికి తమ పేదరికం అడ్డురాగా "నాన్నా, నాకు చిన్న సైకిల్ కొనిపె ట్టరూ— నాకు కొత్త గౌను కొనిపెట్టరూ—" అని దీనంగా బిక్కుబిక్కుమంటూ అడిగే చిన్నారి పాపల దయనీయస్థితిని తలుచుకుంటూ గుండెలవిసేలా దుఃఖిస్తున్నాడు. సముద్ర మంతటి దుఃఖాన్ని కడుపులో పెట్టుకొని, కడుపులో అగ్ని పర్వతాలు బ్రద్దలౌతున్నా, మ్రింగలేక- కక్కలేక భోరుమని ఏడ్వకుండా కళ్ళవెంబడి ధారాపాతంగా కారుచున్న నీళ్లు బుర్ర మీసాలను తడిపివేయగా మౌనంగా రోదిస్తున్నాడు.

తన ఈ దుస్థితికి కారకులెవ్వరు? ఎంతో కొంత ఆస్తి వుండి, నాలుగంకెల్లో జీతం పొందుతున్న తను ఇంత దీనస్థి తిలో ఎందుకున్నట్టు? నా యీ దయనీయ పరిస్థితికి ఎవరిని నిందించాలి? బాగా ఆలోచించాడు. దీనికి బాధ్యులు తన కుటుంబ సభ్యులా? సంఘమా? పరిస్థితులా? ఏవి? మారే పరిస్థితులతో మారని తన తెలివితక్కువతనమా? ఒకప్పుడు దర్జాగా బ్రతికి వంద ఎకరాల ఆస్తికి వారసుడైన భూస్వామి భూపతిరావు మనుమడైన తనకు ఇంతటి దయనీయ స్థితి ఎందువల్ల వచ్చింది- బాగా ఆలోచించాడు. ఇందులో ఎవరి తప్పు కనపడటంలేదు. జీవితంపై నిర్లక్ష్యంతో, భవిష్యత్తును గూర్చి ఆలోచించని తనదే తప్పు. ఇదంతా తన స్వయంకృ తాపరాధం. ఇందులో ఎవరినీ నిందించి లాభంలేదు- అని తననుతానే నిందించుకున్నాడు. తప్పెవరిదైనా తన కూతురు

సమస్యకు పరిష్కారమార్గమేమిటి? అని పరిపరి విధాలా ఆలో చిస్తున్న శ్యాంరావుగారికి తన గతం తెరపై బొమ్మలా ప్రత్యక్షమయ్యింది.

కరీంనగర్ జిల్లా పెద్దపల్లి తాలూకాలోని పేరుమోసిన భూస్వాములలో భూపతిరావుగారొకరు. అతడు వంద ఎక రాల బంగారం పండే భూమికి అధిపతి. అతని హయాంలో పదిమంది పాలేర్లతో వ్యవసాయం చేస్తూ వైభవోపేతంగా గడిపేవాడు. అతనికైదుగురు కొడుకులు, నలుగురు కూతుళ్ళ వ్యవసాయంపై వచ్చే ఆదాయంతో కూతుళ్ళ పెళ్ళిళ్ళు వైభ వోపేతంగా జరిపించి, తన ముదుసలి వయస్సు సమీపించే సరికి వంద ఎకరాల భూమిని అలాగే ఉంచాడు. ఐదుగురు కొడుకులు పంచుకోగా ఆస్తి ఒక్కొక్కరికి ఇరవై ఎకరాలు వచ్చింది భూపతిరావు పెద్దకొడుకైన రామారావు ప్రథమ సంతానం శ్యాంరావు. శ్యాంరావు నతడు ఎంతో గారాబంగా పెంచాడు. అతడేదికోరినా క్షణాలమీద ఇచ్చేవాడు. రోజుకో డ్రెస్ చొప్పున నెలరోజులవరకాతడు తొడిగిన డ్రెస్సు తొడుగ కుండా తొడిగేవాడు. బట్ట ఏకొంచెం చిరుగుడుపట్టినా పారే సేవాడు. శ్యాంరావు తన చిన్నతనంలో తాను ఆడింది ఆటగా పాడింది పాటగా సాగించుకన్నాడు. కాని తనకు లభించిన సుఖం, తన తర్వాత కలిగిన నలుగురు తమ్ముళ్ళకు లభించ లేదు. అందరూ పెద్దవారై ఆస్తి పంచుకునేటప్పటికి ఒక్కొ క్కరికి నాలుగెకరాలు వచ్చింది. భూస్వామి, పేరుమోసిన

జమీందారైన భూపతిరావుగారి మనుమలిప్పుడు సామాన్య రైతులయ్యారు. నాలుగెకరాల భూమిపై ఆధారపడియుండడం సరియైనదిగా భావించక శ్యాంరావు ఎలాగో కష్టపడి తనకున్న డిగ్రీ చదువుతో కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. అటు ఆస్తి, ఇటు ఉద్యోగం ఉన్న తాను అదృష్టవంతుడుగానే భావించాడు. అతనిలో తండ్రి తాతలనుండి సంక్రమించిన రాజసం పోలేదు. ప్రతి విషయాన్ని తేలికగా తీసుకొనేవాడు. డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేసేవాడు. ఇంతలో అతనికి ఒక కూతురు పుట్టింది. కూతురు బారసాల నతడు అత్యంత వైభవంగా జరిపించాడు. కూతుర్నెంతో మురిపెంగా చూసుకొనేవాడు. ఆమెకు రెండేళ్ళ వయస్సైనా రాకముందే మరో కూతురు జన్మించింది. తన కూతురు బారసాలకు రమ్మని ప్రాణమిత్రుడైన శేఖరుకు ఆహ్వానం పంపాడు. అతని బదులు అతనినుండి ఒక లేఖ వచ్చింది.

డియర్, శ్యాం!

అనివార్య పరిస్థితులవల్ల నీ కూతురు బారసాలకు రాలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. ఈ సందర్భంగా మిత్రునిగా నీకొక సలహా యివ్వాలని నా కోరిక. ఈ పరిస్థితులలో ఎంతో మంచి ఉద్యోగమున్నా, ఆస్తివున్నా ఇద్దరికంటే ఎక్కువ పిల్లలను భరించడం కష్టం. ఒకప్పుడు పెద్ద జమీందారైన మీ తాతగారి పుత్రులు ఎక్కువ సంతానంవల్లనే

మధ్యతరగతివారయ్యారు. మీ తండ్రిలుకూడా ఆలోచించక పోవడంవల్ల మీరు సామాన్యుడి తరగతికి గెంటివేయపడ్డారు ఐనా మించిపోయిందిలేదు. నీవైనా ఆలోచించి రత్నాల్లాంటి నీ ఇద్దరు పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయి. ఇంత కంటె ఎక్కువగా చదువుకున్నవాడివైన నీకేమీ వ్రాయు లేను. నీ పిల్లల భవిష్యత్తునుగూర్చి ఆలోచిస్తావని ఆశిస్తూ-

నీ ప్రియ మిత్రుడు,
శేఖర్.

శేఖర్ ఉత్తరం చదివిన శ్యాంరావుకు అందులోనున్న నిజం గోచరించలేదు. ఐనా ఏముందిలే అని దాన్ని తేలికగా దీసికొన్నాడు. రెండవ కూతురు బాలసాలకూడా మహావైభవముగానే జరిపించాడు. ఇద్దరు కూతుళ్ళ నతడెంతో అపురూపంగా చూసుకొనేవాడు. అనుకోకుండానే త్వరలోనే వాళ్ళకు మరి యిద్దరు కూతుళ్ళు పుట్టారు. కొడుకుల కెదిరిచూస్తున్న శ్యాంరావు దంపతులకు కూతుళ్ళు పుట్టడంవల్ల నిరాశ ఎదురైంది. దగ్గర కానుపు కావడంవల్ల శ్యాంరావు భార్య ఆరోగ్యం కూడా కొంత దెబ్బతిన్నది. కొంచెంగా ఆతని ఆర్థిక ఇబ్బందులెదురు కాసాగాయి. ఐనా మగపిల్లవాడు కావాలన్న పట్టుదలతో అతడు ఆపరేషన్‌గూర్చి ఆలోచించలేదు. క్షణక్షణానికి పెరిగే ధరలతో, క్రమక్రమంగా పెరుగుతున్న సంతానభారంతో జీతమెంత పెరిగినా పోటీపడేదికాదు. తన మొదటి ఇద్దరి కూతుళ్ళకు లభించిన ఆదరణ తరువాతివాళ్ళకు లభించలేదు.

ఐనా మగవాడు కావాలన్న ఆశతో అతడు ఐదవ కాన్పుకు కూడా ఎదిరిచూసాడు. ఐనా అతనికి ఆశాభంగమే అయింది. ఈసారి కూడా ఆడపిల్లే పుట్టింది. ఆమె బారసాలకు వచ్చిన శేఖర్ అతని స్థితినిజూచి జాలిపడ్డాడు. "ఒరే శ్యాం, ఇద్దరు కూతుళ్లు ఉన్నపుడు నీ పరిస్థితి ఎలా ఉండేది- ఇప్పుడెలా ఉన్నది? రోజురోజుకు దిగజారుతున్న జీవన పరిస్థితులలో నీ వెంత సంపాదించినా పెద్ద కుటుంబాలను పోషించడం కష్టం. ఇప్పటికే చాలా ఆలస్యం చేసావు. నా మాటవిని ఇప్పటికైనా ఆపరేషన్ చేయించుకో" అన్నాడు శేఖర్.

నీ మాటలు నిజమే కావచ్చురా! కాని ఒక్కడైనా మగ పిల్లవాడు లేంది ఎలా? వంశాంకురం ఉండకూడదా ? అన్నాడు శ్యాంరావు. "చదువుకున్న నీవుగూడా మగ, ఆడ అని ఎందుకురా పాకులాడుతావు? ఈ కాలంలో ఎవ్వరైనా ఒక్కరే సంతానం ఉంటే చాలు. ఉన్న పిల్లలను చక్కగా పెంచుకొని వాళ్ళ భవిష్యత్తుకు చక్కని బాటవేస్తే చాలు_" అన్నాడు శేఖర్. "కావచ్చురా! కాని 'అపుత్రస్య గతిర్నాస్తి' అని ఊరకే అనలేదురా మన పెద్దలు. పుత్రుడులేండే పున్నామ నరకంనుండి ఎవరు తప్పిస్తారు? అందుకొరకేరా నేను పుత్ర సంతానం కొరకై ఎదిరిచూసేది" అన్నాడు శ్యాంరావు. "పున్నామ నరకం నీ పిండాకూడు. అర్థంలేని మూఢ నమ్మకాలతో కృళ్ళుపట్టిన ఆచారాలతో పుత్రుడు గొప్పని, పుత్రిక తక్కువని నమ్ముతూ మూర్ఖంగా ప్రవర్తించకు. కూతురు పిండం

పెడితే మాత్రం నీ పున్నామ నరకం తప్పదా? సోకాల్డు పున్నామ నరకాన్ని తప్పించడానికి పుత్రుడే కావాలా? చచ్చిన తరువాత గతులుండవంటూ అర్థంలేని సెంటిమెంట్లతో మోయలేని సంతానాన్ని కంటూ వాళ్ళకు బ్రతికుండగానే గతిలేకుండాచేసే నీలాంటి మూర్ఖుల నేమనాలో తోచడంలేదు' అన్నాడు ఆవేశంగా శేఖర్.

'పోరా! నీ వితండవాదం నువ్వూనూ. ఎంతైనా మగవాడు మగవాడే. ఆర్థిక పరిస్థితిగూర్చేకదా నీవనేది. నారు పోసినవాడు నీరుపోయక మానడు. పిల్లలను కన్నాముకాని వాళ్ళను పోషించలేకపోతామా!' అన్నాడు శ్యాం. 'ఒరే శ్యాం! ఎందుకురా ఈ మెట్టవేదాంతం? రేపు నీ పిల్లలు వీధిన పడి అడుక్కుతింటూంటే నీనారుపోసినవాడేంచేస్తాడో నేను చూస్తాను. మోయలేని ఆర్థిక సమస్యలతో సతమతమౌతూ పిల్లల పెళ్ళిళ్ళు చేయలేక తల బద్దలు కొట్టుకుంటుంటే నీనారుపోసినవాడు ఎలానీరుపోస్తాడో చూస్తానురా. ఒరే శ్యాం! ఒకసారి దేశపరిస్థితిచూడు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి దాదాపు ముప్పది ఏళ్ళలో దేశ జనాభా రెట్టింపయ్యింది. ఇలా జనాభా పెరుగుతూపోతే మరికొన్నేళ్ళలో నిలబడటానికికూడా చోటుండదు. మగపిల్లలైన వారు ఆడపిల్లలు కావాలని ఇలా అపరిమితంగా కంటూ పోతే దేశపరిస్థితి ఏంకావాలి? దేశ అధ్వాన్నస్థితికి ఇదే కారణం కాకున్నా, విపరీతంగా పెరిగే జనాభాకూడా కొంత

కారణమే. అంతేకాకుండా ఒక పాపకు జన్మనివ్వడమంటే స్త్రీకి పునర్జన్మలాంటిది. దగ్గర దగ్గర కాన్పులతో రక్తమాంసాలుడిగిపోగా ఎముకల గూడులా తయారైన చెల్లెమ్మను చూసైనా బుద్ధి తెచ్చుకోరా!' అన్నాడు శేఖర్.

'సరే చూద్దాంలేరా! ఈ టాపిక్ వదులు-' అన్నాడు శ్యాంరావు. బారసాల తర్వాత శేఖర్ వెళ్ళిపోయాడు. ఫలానా రామయ్యకు ఆరవబిడ్డ, నర్సయ్యకు ఏడవబిడ్డ, ఇంకొకరికి ఎనిమిదవ సంతానం మగపిల్లవాడు కలిగాడని ఎదిరిచూసిన శ్యాంరావు మరిముగ్గురు ఆడపిల్లలను కన్నాడు. దినదిన గండంగా గడుస్తున్న విపత్కార పరిస్థితులలో పిల్లల పోషణే కష్టంగా మారింది. పిల్లలతో ఖర్చులు పెరిగాయి. దానికితోడు ధరల పెరుగుదల. శ్యాంరావు ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. కొడుకు కొడుకని మూర్ఖంగా ప్రవర్తించిన శ్యాంరావుకు ఈ పిల్లల నెలా పోషించాలో అర్థం కావడంలేదు. పట్టుబట్టలు కట్టే పిల్లలు ఇపుడు కాటన్ బట్టలుకూడా కట్టే స్థితిలో లేరు. పెద్దకూతురు, మరి ఇద్దరు కూతుళ్ళు పెళ్ళికెదిగారు. కట్నాల విషవలయం ఇంకోదిక్కు. ఉద్యోగంవల్ల వచ్చే డబ్బు ఎందుకూ సరిపోవడంలేదు. నాన్ రిటర్నబుల్ ప్రావిడెంటు ఫండు మరియు రెండెకరాల భూమి అమ్మి పెద్ద కూతురు పెళ్ళిచేసాడు. మిగతా రెండెకరాల భూమి మరియు కొంత అప్పుచేసి రెండవ కూతురు పెళ్ళిచేసాడు. అయినా రెండవకూతురు వరకట్నం సొమ్ము

ఇంకా పదివేలివ్వాలి. అల్లుడు ఎన్నోసార్లడిగాడు. కాని పిల్లల పోషణే కష్టంగా ఉన్న తాను పదివేలెక్కడినుండి తేగలడు? చివరకు విసుగుచెందిన అల్లుడు పదివేలిచ్చేవరకు తన కడప తొక్కకూడదని కూతురును పంపించాడు. దీర్ఘాలోచనామగ్నుడై యున్న శ్యాంరావు, భార్య మూలుగుడుకు ఈలోకంలోకి వచ్చిపడ్డాడు.

రోగాలతో ఎముకలగూడులా తయారైన శ్యాంరావు భార్యకు కంపెనీ మందులైతే ఉచితంగా లభించాయి కాని డాక్టర్ చెప్పిన పళ్ల గురించికాని విటమినిక్ ఆహారంగురించి కాని తన కుటుంబ పరిస్థితిని కళ్లారాచూస్తూ భర్తనెలా అడుగగలదు? రక్తహీనతతో బాధపడుతున్నా, ఎంత నీరసంగా ఉన్నా ఆమె భర్తనుంచి ఏమీ కోరలేదు. మూలుగుతూ మంచంలో పడి ఉన్న ఆమె "ఏమండీ, అన్నయ్యా ఇంటికి పోయిన మూడవ అమ్మాయినుండి లేఖ వచ్చింది– ఇదిగో చదవండి" అని లేచి భర్తచేతికిచ్చింది.

ఆ ఉత్తరం విప్పి చదువుతున్న శ్యాంరావు ముఖంలో క్రమక్రమంగా రంగులు మారసాగాయి. లేఖ పూర్తయేసరికి అతని ముఖంలో కత్తివేస్తేటుకు నెత్తురుచుక్కలేదు. ఆ లేఖ సారాంశమిది.

నాన్నా! అధిక సంతానంతో సంసార నౌకను ఈద్వలేక బాధపడుతున్న మీ కష్టాలను దృష్టిలో ఉంచుకొన్నాను. ఇద్దరు అక్కయ్యల పెళ్ళిళ్ళకై మీరు పడిన పాట్లు వర్ణనా

తీతం. ఇట్టి పరిస్థితులలో మీరు నా పెళ్ళికొరకై పడే పాట్లను తలుచుకొని భయపడ్డాను. ఎలాగో కష్టపడి నా పెళ్లి చేసినా నేను సుఖపడలేను. కట్నాలని, కానుకలని, ఆచారాలని మీ ప్రాణం తీస్తారు. రెండవ అక్కయ్య స్థితి మీకు తెలియంది కాదు. అందుకొరకై మీదృష్టిలో ఇది లేచిపోవడమైనా నేను నన్ను ప్రేమించిన హరిజన యువకుడు నరేష్‌తో పెళ్లి చేసుకొన్నాను. నాకొరకై వెదకి వృధా శ్రమపడకండి. నాన్నా! చిన్నదాన్నైనా ఒక్క విషయం చెపుతాను. పిల్లలను కనగానే సరిపోదు. ఒళ్లు దాచుకోవడానికి సరియైన బట్టకూడా యివ్వలేని మీరు ఇంతమంది పిల్లల నెందుకు కనాలి? మిమ్ములను బాధించినందుకు నన్ను క్షమిస్తారనుకుంటాను.

— మీ కూతురు.

లేఖ పూర్తిచేసిన శ్యాంరావు జుట్టు పీక్కున్నాడు. గుండెలవిసేలా దుఃఖించాడు. అసలే కొనవూపిరితో నున్న ఆతనిభార్య తన మూడవకూతురు చేసినపనికి మరింత కృంగిపోయింది. ఎనిమిది మందికి జన్మనిచ్చిన ఆమె శరీరం ఇక నానుంచి కాదని మొరాయించింది. నిస్సహాయుడైన భర్తను చంటిపిల్లలను వదలి ఆమె ఈలోకంనుండి శాశ్వతంగా నిష్క్రమించింది. వాళ్ళ కుటుంబ పరిస్థితి అలా ఛిన్నాభిన్నమౌతుంటే ఏ నారుపోసినవాడూ ఆదుకోలేదు. నారుపోసినవాడుగా చెప్పబడుతున్న శ్రీవారు ఫ్రేంలో బిగించిన ఫోటోలో చిరునవ్వులు చిందిస్తున్నాడు. * (చిత్రిక జులై 81సం.లో)